సాక్షి నిజామాబాద్

మంగళవారం ◦ 30 ◦ జూలై ◦ 2024



'లక్ష్మి' ద్వారా నీళ్లివ్వండి..!

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లక్ష్మి కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

- 10లో ▸



కిందిస్థాయి సిబ్బందే టార్గెట్!

విద్యుత్ శాఖలో కిందిస్థాయి సిబ్బంది చిన్న తప్పుచేస్తే సస్పెండ్ చేస్తూ.. ఉన్నతోద్యోగులపై చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలున్నాయి.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /22.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు రుణమాఫీ రెండో విడత నిధుల విడుదల

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ రెండో విడత నిధులను మంగళవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో గల ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారుల సమక్షంలో రెండో విడత రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో లబ్ధిదారులైన రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో 22,868 మంది లబ్ధిదారులు..

డొంకేశ్వర్(ఆర్మూర్): రెండో విడత రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. లక్షన్నర వరకు క్రాప్‌లోన్ తీసుకున్న రైతులకు మంగళవారం మాఫీ సొమ్మును అందజేయనుంది. జిల్లాలో లక్షన్నర లోపు పంట రుణం తీసుకున్న రైతులు 22,868మంది ఉండగా, మాఫీ చేయడానికి 210.54కోట్లు అవసరం కానున్నాయి. ఈ నిధులను సంబంధిత రైతు లోన్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. మాఫీ కానున్న రైతుల వివరాలు సంబంధిత బ్యాంకులు, సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయి. అయితే మొదటి విడతలో లక్షలోపు పంటరుణం ఉన్న 44,469 మంది రైతులకు 225.62 కోట్లు మాఫీ జరిగిన విషయం తెలిసిందే.

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో



బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఆదివారం 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, సోమవారం ఉదయం నుంచి 17 వేల క్యూసెక్కులకు తగ్గి ఇన్‌ఫ్లో నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 403క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1075.60(34 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నిండుకుండలా కళ్యాణి ప్రాజెక్టు

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి శివారులోని కళ్యాణి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 408 అడుగులతో నిండుకుండాలా ఉందని నీటి పారుదల శాఖ ఏఈ శివప్రసాద్ సోమవారం తెలిపారు. రెండు రోజులుగా వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టు వరద గేట్లను మూసి వేశామని పేర్కొన్నారు.

సీపీ కార్యాలయానికి ఎస్సై అటాచ్

ఖలీల్‌వాడి: డయల్ 100 ఫిర్యాదును నిర్లక్ష్యం చేశారనే కారణంతో నగరంలోని ఐదో టౌన్ ఎస్సై అశోక్‌ను పోలీస్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ సీపీ కల్మేశ్వర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రెండో టౌన్ ఎస్సైగా పని చేసిన సమయంలో కూడా అశోక్‌ను సీపీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే నాల్గో టౌన్ ఎస్సైగా పని చేసిన సంజీవ్‌ను సీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

'లంచం తీసుకుంటే సహించను'



నిజాంసాగర్: రెవెన్యూ శాఖలో కొందరు అధికారులు లంచాలు తీసుకుంటూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని, అలాంటివారిని ఉపేక్షించబోనని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హెచ్చరించారు. సోమవారం ఆయన వాట్సాప్ వీడియోను రిలీజ్ చేశారు. జుక్కల్ నియోజకవర్గంలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు లంచాలు ఇవ్వనిదే పనులు చేయడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. లంచాలకు అలవాటు పడిన అధికారులు జుక్కల్ నియోజకవర్గాన్ని వదిలి వెళ్లాలని, లేకపోతే పద్ధతి మార్చుకుని పనిచేయాలని సూచించారు.



మినీ ట్యాంక్‌బండ్‌కు జలకళ

ఇటీవల కురిసిన వర్షాలతో నీరు చేరి నిజామాబాద్ నగరంలోని మినీ ట్యాంక్ బండ్ (ఖిల్లా రఘునాథ చెరువు) జలకళను సంతరించుకుంది. పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడడంతో ట్యాంక్ బండ్‌కు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఖిల్లా కోటపై నుంచి 'సాక్షి' తీసిన చిత్రమిది.. – సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఉద్యమ బాట

- సమస్యల పరిష్కారానికి నేడు 'చలోఅసెంబ్లీ'
- తరలివెళ్లనున్న ఉమ్మడి జిల్లాకు చెందిన ఉద్యోగులు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు (ఫైల్)

ఆర్మూర్: సమగ్రశిక్ష (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు మరోసారి ఉద్యమబాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం జేఏసీ నాయకులు చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఉద్యోగులు మంగళవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తరలివెళ్లనున్నారు. ఉదయం 11 గంటలకు వివిధ మార్గాల్లో ఉద్యోగులు అసెంబ్లీకి చేరుకోవాలని నాయకత్వం రూట్ మ్యాప్‌ను సైతం అందజేసింది. మరోవైపు చలో అసెంబ్లీని విఫలం చేయడం కోసం పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్ వారు అందజేసిన సమాచారం మేరకు జిల్లాల్లోనే ఉద్యోగులను నిలువరించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

పదేళ్లుగా పోరాటం

ఎస్ఎస్ఏ ఉద్యోగులు గత పదేళ్లకు పైగా తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని ఆశపడినా సమగ్రశిక్ష ఉద్యోగులకు మొండి చెయ్యే ఎదురైంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ డిమాండ్లు సాధించుకోవడానికి నడుం బిగించారు. అయితే గతేడాది ఉద్యోగులు ఉద్యమబాట పట్టగా.. సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా శిబిరాలను పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి సందర్శించా రు. 'రాష్ట్ర ప్రభుత్వం తలుచుకుంటే ఎస్ఎస్ఏలోని కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను గంటలో పరిష్కరించవచ్చు. కూర్చోబెట్టి మాట్లాడితే చాయ్ తాగేలోపు చర్చలు జరిపి జీవోలు ఇచ్చి వారి సమస్యను పరిష్కరించవచ్చు. మీరు కేసీఆర్ ప్రభు త్వాన్ని గద్దె దింపడానికి అదనంగా ఒక గంట పని చేయండి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మీ సమస్యలన్నింటినీ పరిష్కరించే బాధ్యత నాది..' హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలపై ఊసెత్తడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఒక వైపు ఏళ్ల తరబడి వేతనాల పెంపు లేకపోగా.. సమగ్రశిక్ష ఉద్యోగులకు సైతం 61 ఏళ్లు నిండగానే పదవీ విరమణ చేసి ఖాళీ చేతులతో ఇంటికి పంపించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఉద్యోగులు మరోమారు ఉద్యమానికి సిద్ధమయ్యారు.

ఉమ్మడి జిల్లాలో రెండు వేల మంది ఉద్యోగులు

సమగ్రశిక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది పనిచేస్తుండగా.. ఉమ్మడి జిల్లాలో 2వేల మంది ఉద్యోగుల ఉండగా వీరు సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంతో పాటు కేజీబీవీలు, ఎంఈవో కార్యాలయాలు, భవిత కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ పోస్టుల్లో పనిచేస్తున్నారు.

పర్మినెంట్ చేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష పరిధిలోని అన్ని విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కాకుండా విద్యాశాఖలో వెట్టి చాకిరీ చేస్తున్న మా శ్రమ దోపిడీని సామాజిక సమస్యగా గుర్తించి మా కుటుంబాలకు న్యాయం చేయాలి. – రాజు, జనరల్ సెక్రెటరీ, సమగ్ర శిక్ష జేఏసీ, నిజామాబాద్

సమస్యలు పరిష్కరించాలి



ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులందరికీ యథాస్థానంలో పర్మినెంట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాటను నమ్మి అధికార మార్పులో క్రియాశీలంగా వ్యవహరించాం. ఇప్పుడు కాలయాపన చేయడం తగదు. – ప్రకాశ్, సమగ్ర శిక్ష జేఏసీ నాయకుడు, నిజామాబాద్

అడిషనల్ డీఎంహెచ్‌వోగా జాన్‌బాబు

నిజామాబాద్‌నాగారం: జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వోగా జాన్‌బాబు బదిలీపై రానున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో లె ప్రసీ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నేడో, రేపో విధుల్లో చేరే అవకాశం ఉంది.

జిల్లాలో 200 మందికి పైగా బదిలీలు

నిజామాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖలో సుమారు 200లకు పైగా మంది ఉద్యోగుల బదిలీలు జరిగాయి. జిల్లాస్థాయిలో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్, స్టాఫ్‌నర్సు తదితర పోస్టులకు సంబంధించి ఉద్యోగులకు బదిలీలు జరిగాయి. వీరు ఆర్డర్ కాపీలు తీసుకొని ట్రాన్స్‌ఫర్ చేసిన స్థానాల్లో విధుల్లో చేరుతున్నారు.

ఆర్టీసీ కార్గో ఇన్‌చార్జిగా పాల్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ ఏటీఎం, కార్గో ఇన్‌చార్జిగా బి.పాల్ నియమితులయ్యారు. మిర్యాలగూడ డిపో మేనేజర్‌గా పని చేసిన ఆయన బదిలీపై నిజామాబాద్‌కు వచ్చారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్ఎం జానీరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కష్టపడితేనే ఉన్నతి సాధ్యం

- జ్ఞానాన్ని సమాజ హితానికి ఉపయోగించాలి
- విద్య నిగూఢమైన తరగని సంపద
- ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



బోధన్‌లో ప్రవచనామృతాన్ని అందిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

బోధన్: కష్టపడితేనే ఉన్నతి సాధ్యమని, చదువు ద్వారా పొందిన జ్ఞానాన్ని సమాజహితం, ధర్మ రక్షణకు ఉపయోగించాలని ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సూచించారు. సోమవారం బోధన్‌లోని విజయ సాయి ఉన్నత పాఠశాలలో 'విలువలతో కూడిన విద్య' అనే అంశంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్య నిగూఢమైన తరగని సంపదన్నారు. చదువుతో కీర్తి ప్రతిష్టలు, సుఖసంతోషాలు, సమున్నత స్థానం దక్కుతాయన్నారు. దేశ దశదిశలను మార్చే శక్తి విద్యకు ఉంటుందని, ఆలోచించి విజ్ఞత, విచక్షణతో మాట్లాడాలని సూచించారు. మాటల్లో స్పష్టత, నిర్భయత్వం ఉండాలన్నారు. రామయాణం, మహాభారతంలలోని పలు ఉదంతాలను ఆయన ప్రస్తావించారు. సత్యమే పలకాలని, అబద్ధాలాడితే నమ్మకం కోల్పోతారని పేర్కొన్నారు.

ఓర్పు, సహనం కలిగి ఉండాలి

ప్రతి మనిషికి ఓర్పు, సహనం ఉండాలని చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. సహనం కోల్పోతే సమాజంలో శాంతిభద్రతలు అదుపుతప్పుతాయన్నారు. కన్న తల్లి, భూమాతలకు ఉన్న ఓర్పు గురించి వివరించారు. కోపం, క్షణికావేశాలు జీవితాలను సర్వనాశనం చేస్తాయన్నారు. పాము కుబుసాన్ని వదిలిపెట్టినట్టు మనుషులు కోపాన్ని వదిలించుకోవాలని సూచించారు. కష్ట పడేవారికి ఎదురుదెబ్బలు తగులుతాయని, చిన్నపాటి కష్టాలకు కుంగిపోయి నిరాశ నిస్పృహలకు గురికావద్దని పేర్కొన్నారు. కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంటే వృద్ధిలోకి వస్తారన్నారు. చాగంటి ప్రవచనాలు ఆద్యంతం విద్యార్థులను ఉత్సాహపరిచాయి. ఈ సందర్భంగా ఆయనను మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పురప్రముఖులు పాల్గొన్నారు.



చాగంటిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మశరత్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్



కార్యక్రమంలో పాల్గొన్న పురప్రముఖులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

అర్బన్ అభివృద్ధికి నిధులివ్వడంలో వివక్ష

- తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి
- నిజామాబాద్ అర్బన్ శాసనసభ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ
- ఇందూరు సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి వివక్ష చూపుతున్నారని, అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతూ ఏ పార్టీ నుంచి గెలుపొందినా.. ఎమ్మెల్యేలే ప్రజలకు ప్రతినిధులని, ఓడిన వారు కాదని స్పష్టంచేశారు. ఏడు నెలలుగా నియోజకవర్గంలో వంద మీటర్ల రోడ్లు వేయ లేదని, ఈ నియోజకవర్గంపై ఎందుకంత వివక్ష అని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొడంగల్‌కు ఇచ్చిన నిధుల్లో పదిశాతం తమ నియోజకవర్గానికి వెచ్చించినా.. బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇప్పటికైనా నగర అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. నియోజక వర్గంలోని నాగారంలో 396, కలెక్టరేట్‌కు ఆనుకుని 252 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారని, వాటిని అర్హులకు కేటాయించకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని సభ దృష్టికి తెచ్చారు. అర్హుల జాబితా ఎంపిక చేసి ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వెంటనే ప్రారంభించి అర్హులకు సొంతింటి కలను నిజంచేయాలని కోరారు. జిల్లాకేంద్రంలో నిర్మించిన ఐటీ హబ్ ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కడం లేదని, ప్రముఖ కంపెనీలు లేకపోవడం కూడా కారణమని సంబంధిత మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎన్‌సీ కంపెనీలతో ఐటీ హబ్‌లో ఎంవోయూ చేసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. నిజాంషుగర్స్‌తో పాటు సారంగాపూర్ చక్కెర పరిశ్రమ తెరిపించి, సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణ వర్సిటీలో విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్న పరిస్థితి నెలకొందని, పరిష్కారానికి చొరవ చూపాలని, మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వానికి విన్నవించారు. టీయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

'ఎక్సైజ్'లో బదిలీలకు రంగం సిద్ధం!

- ఆగస్టు మొదటివారంలో ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో కానిస్టేబుళ్లు 135 మంది, హెడ్‌కానిస్టేబుళ్లు 46 మంది
- జూనియర్ అసిస్టెంట్లు 30 మంది

ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లాలోని ఎక్సైజ్‌శాఖలో బదిలీలకు రంగం సిద్ధమైంది. ఏడేళ్లుగా శాఖలో బదిలీలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత రెండేళ్లకు ఎక్సైజ్‌శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు చేయగా మళ్లీ సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎక్సైజ్ అధికారులకు బదిలీలు జరుగనున్నాయి. జూలైలో బదిలీలు కావాల్సి ఉండగా ప్రభుత్వం ఆగస్టుకు మార్చినట్లు సమాచారం. శాఖలో ఉన్నతాధికారులైతే రెండేళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, జూనియర్ అసిస్టెంట్లు అయితే మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారికి బదిలీలు చేయనున్నారు.



ఉమ్మడి జిల్లాలో 10 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు

ఉమ్మడి నిజామాబాద్‌లోని డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్‌తో పాటు ఇద్దరు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్లు ఉన్నారు. నిజామాబాద్‌లో 5, కామారెడ్డి జిల్లాలో ఐదు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలో సీఐ స్థాయి అధికారులు బాధ్యతలు నిర్వహిస్తారు. వీటితో పాటు జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో 81 మంది కానిస్టేబుళ్లు, 31 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కామారెడ్డిలో జిల్లాలో 54 మంది కానిస్టేబుళ్లు, 15 మంది హెడ్‌కానిస్టేబుళ్లు ఉన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలో జూనియర్ అసిస్టెంట్లు 30 మంది పని చేస్తున్నారు.

కానిస్టేబుళ్ల పదోన్నతులపై కోర్టులో కేసు..

ఎక్సైజ్ కానిస్టేబుళ్ల బదిలీలకు సంబంధించి రాష్ట్ర అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. కానిస్టేబుళ్ల సీనియారిటీ ప్రకారం హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందాల్సి ఉంటుంది. కానీ సీనియారిటీ విషయంలో కొంత మంది కానిస్టేబుళ్లు కోర్టుకు వెళ్లడంతో పదోన్నతులు ఆగిపోయినట్లు తెలిసింది. హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న వారికి ఎస్సైలుగా అవకాశాలు వస్తాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

డ్రై ఏరియాలో పని చేస్తున్న వారికి..

డ్రై ఏరియాలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లతో పాటు ఎక్సైజ్ అధికారులు, చెక్ పోస్టుల్లో పనిచేస్తున్న వారికి ఏడాదిలో బదిలీ చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఉమ్మడి జిల్లాలోని డ్రై ఏరియా అయిన భీమ్‌గల్, మోర్తాడ్, బిచ్కుంద ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందిని ఏడాది తర్వాత బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు బదిలీలు చేయకపోవడంతో ఏళ్ల నుంచి అక్కడే పనిచేస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు బదిలీ ప్రక్రియ చేపట్టడంతో ఎక్సైజ్ అధికారులు వెబ్ ఆప్షన్ కోసం ఎదురుచూస్తున్నారు.

జూలైలోనే బదిలీలు జరుగుతాయని భావించినా..

జూలై నెలలోనే మిగతా శాఖలతో పాటు ఎక్సైజ్‌శాఖకు బదిలీలు జరుగుతాయని అందరూ భావించారు. కానీ ఎక్సైజ్‌శాఖకు ఇచ్చిన టార్గెట్‌లతో వాటిని అధికారులు వాయిదా వేసినట్లు తెలిసింది. దీంతో ఆగస్టు మొదటివారంలో ఎక్సైజ్ శాఖలో రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసిన ఉన్నతాధికారులు తర్వాత ఆగస్టు రెండో వారంలో కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లకు బదిలీ ఉంటుందని ఎక్సైజ్‌శాఖలో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

నల్లమడుగు నేలమత్తడికి బుంగ



లింగంపేట: నల్లమడుగు శివారులోని పెద్దవాగుపై ఏర్పాటు చేసిన నేలమత్తడికి బుంగపడి సాగునీరు వృథాగాపోతోంది. బుంగకు మరమ్మతులు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మత్తడి ఆధారంగా నల్లమడుగు, రామలక్ష్మణ్‌పల్లి గ్రామాల శివారులోని 2,500 ఎకరాలలో పంటలు సాగవుతాయి. బుంగ వల్ల నీరు వృథాగా పోతుండడంతో ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గండికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



బాన్సువాడ : రిటైర్ అయిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు శంకర్ అన్నారు. సోమవారం బాన్సువాడలో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. 2019 నుంచి ఇప్పటి వరకు రిటైర్ట్ అయిన ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన రిటైర్‌మెంట్ డబ్బులు ఇప్పటి వరకు రావడం లేదని, యాజమాన్యం స్పందించిన వెంటనే డబ్బులు వచ్చేలా చూడాలని సూచించారు. రిటైర్ అయి మృతిచెందిన కార్మికులకు రావాల్సిన చావు ఖర్చులు అదే రోజు చెల్లించాలన్నారు. రిటైర్‌మెంట్ కార్మికులకు ప్రతి నెలా రూ.7500 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులు మహమూద్, నాగ్‌నాథ్, ఫరీద్, పండరి, సిరాజుల్లా, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

రీడింగ్ తెలుసుకోడానికే స్మార్ట్ మీటర్లు



కామారెడ్డి క్రైం : ఉదయ్ స్కీం కింద కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టమని కోరిందే కానీ ఉచిత కరెంట్ ఇవ్వకూడదని చెప్పలేదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. వ్యవసాయ మోటార్లకు మీటర్ల విషయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు అనేది రీడింగ్ తెలుసుకోవడం కోసమేనని, దాన్ని పెట్టినా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కరెంట్ ఇవ్వొచ్చని పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ వర్కర్లు, మీటర్ రీడింగ్ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వెలుగు చూస్తున్న విద్యుత్ అక్రమాలపై హౌజ్ కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఓవర్ లోడ్ కారణంగా ఎందరో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కావాలని కోరుతూ డీడీలు కట్టినా సకాలంలో ఏర్పాటు చేయడం లేదన్నారు. విద్యుత్ లైన్‌కు 30 మీటర్ల పైబడిన దూరం ఉన్న ఇళ్లకు వేలల్లో డబ్బులు కట్టాలని అడుగుతుండడం సరికాదన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి అలాంటి వాటిని ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. రైతులకు ఉచితంగా విద్యుత్ లైన్ వేసి ఇవ్వాలన్నారు. చాలాచోట్ల ఇళ్లపై నుంచి ప్రధాన విద్యుత్ లైన్ తీగలు వెళ్తున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంనుంచి తలపడిన ముగ్గురం కూడా సభలో ఉండే అవకాశం ఇచ్చిన కొడంగల్, గజ్వేల్, కామారెడ్డి ప్రజలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తనపై పోటీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్‌లతో కలిసి తాను కూడా అసెంబ్లీకి రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

వలస కార్మికులకు నిరాశ

- బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమాన్ని ప్రస్తావించని ప్రభుత్వాలు
- అడియాసలైన ఆశలు



మోర్తాడ్ : గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు వలస వెళ్లి న కార్మికుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూడటంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లోను, గురువారం నాటి రాష్ట్ర బడ్జెట్‌లో వలస కార్మికుల ప్రస్తావన అసలే లేకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వలస కార్మికులు ప్రతి ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యం తరలించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థికంగా దన్నుగా నిలచినా కార్మికుల ఊసే లేకుండా బడ్జెట్ ప్రసంగాలు ముగిసిపోయాయి. ఎన్నో ఆశలతో బడ్జెట్‌లో కేటాయింపుల కోసం ఎదురు చూసిన వలస కార్మికులకు అటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ నిరాశను మిగల్చగా, ఇటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆశలను అడియాసలు చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ రాష్ట్రాల్లో ప్రత్యేక విధానం

కేరళ, పంజాబ్‌లో అక్కడి వలస కార్మికుల వినతి మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రవాసీ విధానం అమలు చేస్తున్నాయి. తెలంగాణలోను కేరళ, పంజాబ్ తరహాలో ప్రవాసీ విధానం లేదా గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా ఏళ్ల నుంచి వినిపిస్తుంది. కేరళలో వలస కార్మికుల కోసం అమలు చేస్తున్న ప్రవాసీ విధానంపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్నతాధికారుల బృందం అధ్యాయనం చేసి వచ్చింది. అయినప్పటికి గత ప్రభుత్వం వలస కార్మికుల కోసం ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయలేదు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు గల్ఫ్ దేశాల్లో పర్యటించి వలస కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగానే కాంగ్రెస్ మేనిఫెస్టోలో గల్ఫ్ సంక్షేమ బోర్డు అంశం చేర్చింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన తరువాత రేవంత్‌రెడ్డి 2024 సెప్టెంబర్ 17 నాటికి గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు కార్యాచరణ ఏది ఆరంభించకపోవడంతో వలస కార్మికులు అయోమయానికి గురవుతున్నారు. బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటయించడంతో పాటు ప్రత్యేక బిల్లు ప్రవేశపెడితేనే గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు అడుగులు ముందుకు పడుతాయని అందరు భావించారు. అందుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను పట్టించుకోకపోవడంతో వలస కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల సంక్షేమాన్ని మరిచాయి



వలస కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ మరిచాయి. వలస కార్మికులు పోరాటం చేయక తప్పని పరిస్థితిని సృష్టించాయి. ఎన్నో ఏళ్లుగా కలలు కంటున్న సంక్షేమ ఫలాలను అందించే ఉద్దేశం కేంద్రానికి, రాష్ట్రానికి లేదు. గల్ఫ్ కార్మికులకు కేంద్రం రూ.5వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించాలి.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు

‘లక్ష్మి’ ద్వారా నీళ్లివ్వండి..

- పెరుగుతున్న నీటి విడుదల డిమాండ్
- 34 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మి కాలువ ద్వారా నీటివిడుదల చేపట్టాలని రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. గత పది రోజులుగా ప్రాజెక్టులో ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 34 టీఎంసీలకు నీటి నిల్వ ఉంది. లక్ష్మి కాలువ ప్రధాన ఆయకట్టు 25వేల ఎకరాలు కాగా.. వేంపల్లి, నవాబు, హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలు కలుపుకుని 50వేల ఎకరాల ఆయకట్టు ఉంటుంది. ఈ ఆయకట్టుకు ఖరీఫ్‌లో 2.5 నుంచి 3 టీఎంసీల నీరు సరిపోతుందని ప్రాజెక్ట్ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. ప్రాజెక్టుకు ప్రస్తుతం ఇన్‌ఫ్లో వస్తుండడంతో వెంటనే నీటి విడుదల చేపట్టి ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడాలని వేడుకుంటున్నారు. రోజుకు కనీసం 100 క్యూసెక్కుల నీటి విడుదల చేపట్టినా వరినాట్లు వేసుకోవచ్చంటున్నారు.

మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

లక్ష్మి కాలువ ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో కాకుండా మైనర్ ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. నీటి విడుదల సైతం మైనర్ ఇరిగేషన్ అధికారులే పర్యవేక్షిస్తారు.



లక్ష్మికాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దకు వచ్చిన నీరు

ప్రాజెక్టు నుంచి ఇంత నీరు ఆయకట్టుకు అవసరం ఉంటుందని అధికారులు ప్రాజెక్ట్ అధికారులకు లేఖ రాస్తే అప్పుడు ప్రాజెక్టు అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. ప్రభుత్వం ఒకే చెబితే నీటివిడుదల చేపడతారు.

వరి నాట్లకు ఉపయోగం

ప్రాజెక్టు నీటిమట్టం 1064 అడుగులకు చేరినా కూడా నీటి సరఫరా చేసే అవకాశం కేవలం లక్ష్మి కాలువ మాత్రమే ఉంది. అయితే ప్రాజెక్టులో ప్రస్తుతం నీరుండడంతో వెంటనే విడుదల చేస్తే వరి నాట్లు వేసుకునే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లో కొంత మేర నీరు చేరింది. దీనికి తోడు కాలువ ద్వారా నీటిని సరఫరా చేస్తే వరినాటు వేసుకోవచ్చు. అందుకే అధికారులు వెంటనే స్పందించి నీటి విడుదల చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నీటి విడుదల చేపట్టాలి



ప్రాజెక్టు నుంచి లక్ష్మి కాలువ ద్వారా వెంటనే నీటి విడుదల చేపట్టాలి. గత పది రోజులుగా కురిసిన వానాల వలన కొంత నీరు వచ్చింది. కాలువ ద్వారా నీటి విడుదల చేపడితే వరి నాట్లు వేసుకోవచ్చు. అధికారులు వెంటనే స్పందించాలి.

– శివచరణ్‌రెడ్డి, అయకట్టు రైతు, కొత్తపల్లి

సీబీఐ పేరిట సైబర్ నేరగాళ్ల బెదిరింపు

- సైబర్ క్రైం, పోలీసులకు ఫిర్యాదులు

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. గత వారం రోజులుగా పోలీసు ఉన్నతాధికారులమని పేర్కొంటూ ఫోన్ కాల్స్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. సోమవారం సైతం జిల్లాకు చెందిన ముగ్గురికి ఫోన్ కాల్స్ వచ్చాయి.

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన మహిళకు సైబర్‌నేరగాళ్లు సీబీఐ పేరిట సోమవారం ఫోన్ చేశారు. ఆమె భర్త, కుమారుడిని ఓ కేసులో కిడ్నాప్ చేస్తున్నామని, వారిని కిడ్నాప్ చేయకుండా ఉండాలంటే డబ్బులు చెల్లించాలని సదరు మహిళను బెదిరించారు. ఏ కేసులో తమ వారిని కిడ్నాప్ చేస్తారని మహిళ ప్రశ్నించడంతో సైబర్‌నేరగాడు ఆమెను హిందీలో దూషించాడు. ఆమె వెంటనే ఫోన్ కట్ చేసి తన భర్తకు ఫోన్ చేసి విషయం తెలిపి సైబర్ క్రైం, నాల్గో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వారం రోజుల క్రితం ఓ మహిళకు..

వారం రోజుల క్రితం ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి డ్రగ్స్ కేసులో నీ కుమారుడిని అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకెళ్తున్నామని, అరెస్టు చేయకుండా ఉండాలంటే వెంటనే డబ్బులు చెల్లించాలని ఫోన్ పే నంబర్‌ను పంపించారు. తరువాత సదరు మహిళ తన కుమారుడితో ఫోన్‌లో మాట్లాడగా, తాను ఇంటి వద్దే ఉన్నట్లు తెలపడంతో సైబర్ నేరగాడితో ఆ మహిళ వాగ్వాదానికి దిగింది. అనంతరం జక్రాన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా స్పందన లేదని తెలిసిన వారికి సదరు మహిళ చెప్పినట్లు తెలిసింది. ఇటీవల సైబర్‌నేరగాళ్లు వివిధ పోలీస్ డిపార్ట్‌మెంట్ల పేర్లు చెప్పి ఫోన్‌లు చేస్తూ బెదిరిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

కొండూర్‌కు చెందిన వ్యక్తికి..

సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామానికి చెందిన దేవుడుగాళ్ల శంకర్ మండల కేంద్రంలో ఫుట్ వేర్ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం ఉదయం 10.46 గంటలకు శంకర్‌కు సైబర్‌నేరగాడు ఫోన్ చేశాడు. తాను సీపీని మాట్లాడుతున్నానని.. డ్రగ్స్ వ్యాపారం చేస్తున్న మీ కొడుకు వినేశ్‌ను అరెస్ట్ చేశామని, అతడిని విడిచి పెట్టాలంటే రూ.2.50లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నా కొడుకు మీ దగ్గర ఉంటే తనతో మాట్లాడించాలని శంకర్ నేరగాడితో అనగా, మీ కొడుకు లేడని వేరే వాళ్లను అరెస్ట్ చేస్తే వాళ్లు మీ కొడుకు పేరు, మీ పేరు చెప్పారని అన్నాడు. మీరు ఎక్కడి నుంచి మాట్లాడుతున్నారని ప్రశ్నించడంతో సైబర్‌నేరగాడు ఫోన్ కట్ చేశాడని శంకర్ తెలిపాడు. ఆ వెంటనే నంబర్‌ను ట్రూకాలర్‌లో చెక్ చేయగా పాకిస్తాన్ నుంచి వచ్చినట్లు చూయించిందన్నారు. మైలారం గ్రామానికి చెందిన మరొకరికి కూడా ఇలాగే ఫోన్ వచ్చినట్లు తెలిసింది.

అపరిచిత వ్యక్తుల కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై గంగాధర్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): అపరిచిత వ్యక్తుల కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గంగాధర్ సూచించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని సింగంపల్లికి చెందిన దేశాల భూమేశ్‌కు ఇటీవల అపరిచత వ్యక్తి వాట్సాప్ కాల్‌లో డబ్బులు డిమాండ్ చేశారన్నారు. వెంటనే అతడు అప్రమత్తమై పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు కేసుల్లో ఇరుకున్నారని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి, డబ్బులు అడిగితే వెంటనే డయల్ 100 లేదా 1930 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

కిందిస్థాయి సిబ్బందే టార్గెట్!

- చిన్నపాటి తప్పు చేస్తే సస్పెండ్
- విద్యుత్‌శాఖలో వింత ధోరణి

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖ అధికారులు వింత ధోరణిని అవలంబిస్తున్నారని, కిందిస్థాయి సిబ్బంది చిన్నపాటి తప్పులు చేస్తే ఎలాంటి విచారణ లేకుండానే సస్పెండ్ చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే, కిందిస్థాయి సిబ్బందిపై నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న అధికారులు.. మండల, డివిజన్ స్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకునే విషయంలో వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలున్నాయి. పలువురు మండల, డివిజన్ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు సంస్థకు పెద్ద ఎత్తున నష్టం చేకూరుస్తున్నారని ఆధారాలున్నప్పటికీ విచారణ, ఉన్నతాధికారుల ఆదేశాల పేరుతో చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇటివలే బోధన్ డివిజన్ ఏడీఈ, ఏఈ మధ్య చిన్నపాటి గొడవ జరగగా, ఇద్దరినీ ఆదిలాబాద్ జిల్లాకు సీఎండీ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆర్మూర్ డివిజన్‌లో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. అసలు ఆర్మూర్ డివిజన్‌లో సంస్థకు సంబంధించిన విషయాలు సీఎండీ దృష్టికి వెళ్తున్నాయా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



ఆర్మూర్ డివిజన్ పరిధిలో పెర్కిట్ సెక్షన్ పరిధిలో కేవలం 2 గంటలపాటు ఫోన్ లిఫ్ట్ చేయలేదని కోపంతో ఊగిపోయినా డీఈ ఎలాంటి విచారణ లేకుండానే లైన్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. విధులను నిర్లక్ష్యం చేశారనే కారణంతో నందిపేట్ సెక్షన్‌లో కుద్వాన్‌పూర్ ఆర్జిజన్, సీహెచ్ కొండూర్ లైన్‌మెన్‌లను నిజామాబాద్ డివిజన్ డీఈ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇలా పలువురు కిందిస్థాయి సిబ్బందిని చిన్నపాటి కారణాలను చూపుతూ డీఈలు సస్పెండ్ చేసిన ఘటనలు బోలెడున్నాయి. ఆర్మూర్ డివిజన్‌లో ఓ లైన్‌మెన్ 45 రోజులపాటు విధులకు హాజరుకాకున్నా, హాజరైనట్లు చూపి మొత్తం వేతనం ఇచ్చారు.

బోధన్‌లో అలా.. ఆర్మూర్‌లో ఇలా..

బోధన్ డివిజన్ పరిధిలోని ఎడపల్లి ఏడీఈ సెక్షన్ పరిధిలో ఏడీఈ, ఏఈ మధ్య చిన్నపాటి గొడవ జరగ్గా చర్యలు తీసుకున్న ఉన్నతాధికారులు.. ఆర్మూర్ డీఈ విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్మూర్ డీఈ అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు సీఎండీ వరుణ్‌రెడ్డికి ఫిర్యాదులు వెళ్లడంతో ఏపీటీఎస్ సీఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ అక్రమాలకు సంబంధించి విద్యుత్ ఉద్యోగులు పూర్తి వివరాలు అందజేసినట్లు సమాచారం. సదరు డీఈ పెర్కిట్ సెక్షన్‌లో ఓ లైన్‌ఇన్‌స్పెక్టర్‌కు నాలుగుకు పైగా షోకాజ్ నోటీసులు ఇవ్వడంతోపాటు మూడు ఇంక్రిమెంట్లు కట్ చేశాడని, దీంతో లైన్ ఇన్‌స్పెక్టర్ మనోవేదనకు గురై మరణించాడని తెలిసింది. మెమోలు, షోకాజ్‌ల పేరుతో ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్న డీఈ.. బోధన్ డివిజన్‌లో పని చేసిన సమయంలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేశారనే ఆరోపణలున్నాయి. షోకాజ్‌ల భయం చూపుతూ ఎంతోమంది నుంచి ముడుపులు అందుకున్నారని ఉద్యోగులు అంటున్నారు. తనకు సంబంధించిన వారితో ఓ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న ఈడీ.. డబ్బులు ఇవ్వకుంటే హెచ్‌ఆర్‌ఏ కట్ అంటూ వసూళ్లు చేశారని విమర్శలున్నాయి. డీఈ వ్యవహారశైలిపై ‘సాక్షి’లో కథనాలు ప్రచురితం కావడంతో ఈ ఏడాది జనవరి 29న సీఎండీ షోకాజ్ ఇచ్చినట్లు తెలిసింది. సీఎండీ పూర్తస్థాయిలో ఆర్మూర్ డివిజన్‌పై దృష్టి సారిస్తేనే వ్యవస్థ గాడిలో పడుతుందని శాఖ ఉద్యోగులు అంటున్నారు.

గాయత్రినగర్‌లో కలకలం

కామారెడ్డి క్రైం: అనుమానాస్పదంగా వ్యవహరిస్తూ నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు కాలనీలోకి రావడంతో కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గాయత్రినగర్‌లో కలకలంరేగింది. పిల్లలను కిడ్నాప్ చేసే వారు వచ్చారని సోమవారం సాయంత్రం స్థానికులు పెద్దసంఖ్యలో పోగై పోలీసులకు సమాచారం అందించారు. దేవునిపల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారించారు. అయితే, అనుమానాస్పదంగా వ్యవహరించిన వారు వ్యభిచార ముఠా అని తేలినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రుణమాఫీపై మంత్రికి ఫిర్యాదు

నిజాంసాగర్: రైతుల పేరిట మాగి గాయత్రి కర్మాగారం తీసుకున్న రుణాలపై విచారణ చేపట్టాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ఈ విషయమై సోమవారం వ్యవసాయశాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల పేరుతో గాయత్రి కర్మాగారం రూ. 9 కోట్ల రుణాలు తీసుకుందని పేర్కొన్నారు. రుణమాఫీ డబ్బులు రైతులకే అందేలా చూడాలని మంత్రిని కోరాననని తెలిపారు.

వెండితో ఉడాయించిన వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి: వెండి అభరణాలతో ఉడాయించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. నాందెడ్‌కు చెందిన సిల్వర్ మర్చంట్ యజమాని రాహుల్ కొద్ది రోజుల క్రితం తన దగ్గర పనిచేసే సునీల్, నదీమ్‌ను కాళ్ల పట్టీలు, ఇతర వెండి ఆభరణాలను పాలిష్ చేయించుకురావాలని హైదరాబాద్‌కు పంపించాడు. తిరుగు ప్రయాణంలో నిజామాబాద్ వరకు వచ్చిన వారిద్దరూ రైల్వేస్టేషన్‌లోని రెస్ట్ రూమ్‌లో నిద్రించారు. అయితే, సునీల్ నిద్రపోయినట్లు గమనించిన నదీమ్ తన వద ఉన్న 14.500 కిలోల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. నదీమ్ వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడని సునీల్ తన యజమానికి ఫోన్‌లో తెలుపగా, ఆయన నిజామాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు నదీమ్‌కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా, నదీమ్ తాను ఎత్తుకెళ్లిన వెండి ఆభరణాలను విక్రయించడం కోసం హైదరాబాద్‌కు వెళ్లేందుకు నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైల్వే పోలీసులను చూసి పారిపోతుండగా అతడిని పట్టుకొని తనిఖీ చేయగా బ్యాగులో వెండి ఆభరణాలు బయటపడ్డాయి. నిందితుడిని సికింద్రాబాద్ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే ఎస్సై సాయిరెడ్డి

పలువురిపై కుక్కల దాడి



కుక్క కాటును చూపుతున్న బాధితుడు

రాజంపేట: మండల కేంద్రాని కి చెందిన పలువురిపై కుక్కలు సోమవారం దాడి చేసి గాయపర్చింది. గత కొంతకాలంగా కుక్కల బెడద తీవ్రమైందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పిచ్చి కుక్కలు పలువురిని గాయపర్చడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. కుక్కల బెడదను నివారించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి అశోక్ స్పందిస్తూ.. డాగ్ క్యాచర్స్, గ్రామపంచాయతీ సిబ్బంది సహాయంతో కుక్కలను పట్టించే చర్యలు తీసుకుంటామని, దీనికి పెంపుడు కుక్కల యజమానులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

పేకాట స్థావరాలపై దాడి

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 29 మందిని అదుపులోకి తీసుకొని, రూ.1,37,000 నగదు, 10 కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ఆర్మూర్ పోలీసులకు అప్పగించారు.

ముబారక్‌నగర్ శివారులో..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముబారక్ నగర్ శివారులోని చెరువు కట్ట దగ్గరలో పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.3,440 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

యువకుడి అదృశ్యం

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన సయ్యద్ చాంద్‌పాషా(28) అదృశ్యమైనట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈనెల 27వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన పాషా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారని, ఆచూకీ లభించకపోవడంతో పాషా సోదరుడు సయ్యద్ షబ్బీర్ సోమవారం ఫిర్యాదు చేశారన్నారు. బైక్ మెకానిక్ అయిన పాషాకు మూగ, చెవుడు ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మంగళ్‌పాడ్‌కు చెందిన యువతి..

ఎడపల్లి(బోధన్): మండలంలోని మంగల్‌పాడ్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. మగ్గం వర్క్‌కు సంబంధించిన వస్తువులు తీసుకువస్తానని గత నెల 24న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన యువతి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఆదివారం ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం

ఖలీల్‌వాడి: నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ వ్యక్తి జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేశాడు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భీమ్‌గల్ పట్టణానికి చెందిన సూర్యవంశీ చంద్రకాంత్ (43) కొంత కాలంగా నోటిక్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. భార్యాపిల్లలు వదిలివెళ్లిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన చంద్రకాంత్ సోమవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకొని హైదరాబాద్ వైపు వెళ్తున్న రైలుకు ఎదురు వెళ్లాడు. ఈ ఘటనలో చంద్రకాంత్ రెండు కాళ్లు కోల్పోగా, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌ను రప్పించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

పాముకాటుతో మహిళారైతు మృతి



శశికళ (ఫైల్)

పిట్లం(జుక్కల్): పొలం పనులు చేస్తుండగా పాము కాటువేయడంతో మహిళా రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కంభాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన శశికళ(58) తన సొంత పొలంలో పనులు చేస్తుండగా మధ్యాహ్నం పాముకాటువేసింది. వెంటనే ఆమె కుటుంబ సభ్యులు, స్థానికులు కలిసి ఆమెను పిట్లం ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి బాన్సువాడకు ఆ తరువాత నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



వినీత్ (ఫైల్)

భీమ్‌గల్: మండలంలోని ముచ్కూర్ గ్రామ పంటపొలాల్లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామానికి చెందిన దర్శనం వినీత్(25)కు ముచ్కూర్ గ్రామానికి చెందిన సంపదతో గత మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది.వారం రోజుల క్రితం ముచ్కూర్‌లోని అత్తవారింటికి వచ్చిన వినీత్ సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి బురదలో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వినీత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరిబాబు తెలిపారు.

పరిస్థితి విషమించి ఒకరు..

నిజామాబాద్‌రూరల్: ప్రమాదవశాత్తు కాలుజారిపడిన మహిళ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహేశ్ సోమవారం తెలిపారు. జక్రాన్‌పల్లి మండలానికి చెందిన నర్ర గంగామణి(35) పని నిమిత్తం ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిందని, సొంతూరుకు తిరిగి వెళ్తున్న క్రమంలో బైపాస్‌రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు పరిగెత్తుతూ కాలుజారి కిందపడడంతో తలకు బలమైన గాయమైందన్నారు. వెంటనే ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందిందని, మృతురాలి అన్న లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.